హెచ్ఎంపై దాడిని ఖండిస్తూ ఉపాధ్యాయుల నిరసన

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కోటగిరి, జనవరి 20 : రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంపై జరిగిన దాడినిఖండిస్తూ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసరావు, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు బర్ల సాయిలు, ప్రధాన కార్యదర్శి ఉదయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడడంలో అధికారుల నిర్లక్ష్యం

- అధికారుల తీరుకు నిరసనగా అఖిలపక్ష నాయకుల ధర్నా

తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అఖిల పక్ష నాయకులు

కోటగిరి, జనవరి 20 : మండలకేంద్రంలో ప్రభుత్వ స్థలాలు అక్రమణకు గురవుతున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని తహసీల్ కార్యాలయం ఎదుట అఖిలపక్ష నాయకులు సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు విఠల్‌గౌడ్, పోచీరాం మాట్లాడుతూ.. ఇరిగేషన్ కాలువకు సంబంధించిన స్థలం కబ్జాకు గురవుతున్నదని, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలువ హద్దుల ఆక్రమణతో రైతులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కబ్జాకు గురైన స్థలాలను కాపాడాలని ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రం అందజేశారు.

'ఆశకార్యకర్తలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి'

మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశకార్యకర్తలు

పొతంగల్, జనవరి 20 : ఫిబ్రవరిలో నిర్వహించే బడ్జెట్ సమావేశాల్లో తమకు రూ.18 వేల వేతనం నిర్ణయించాలని ఆశకార్యకర్తలు డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 21న పాదయాత్ర చేపట్టనున్నామని తెలిపారు. ఆశకార్యకర్తలు ఉదయం 10 గంటలకు నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చేరుకోవాలని ఆశ యూనియన్ కార్యదర్శి రేష్మ పిలుపునిచ్చారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు నన్నేసాబ్, స్రవంతి, పుష్పలత, నాగమణి, కళావతి, లింగమణి, లత, అనిత, శాంత, రుక్మిణి, పోశవ్వ పాల్గొన్నారు.

సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- రుద్రూర్, చందూర్‌లో సర్వే పరిశీలన

చందూర్‌లో సర్వే వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రుద్రూర్/ చందూర్, జనవరి 20 : రైతుభరోసా సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. రుద్రూర్ మండలకేంద్రంతోపాటు అక్బర్‌నగర్, చందూర్‌లో కొనసాగుతున్న సర్వేను సోమవారం పరిశీలించారు. సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రుద్రూర్ మండలకేంద్రంలో బస్టాండ్ వెనకాల ఉన్న పట్టాభూమిలో వెంచర్ ఏర్పాటు చేశారు. అలాంటి భూమికి రైతుభరోసా రాదని, అధికారులు గమనించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి భూములు వెలికిరాని పక్షంలో మూడు విడుతల్లో నిర్వహించే గ్రామసభల్లో అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కలెక్టర్ వెంట సబ్‌కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేశ్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ భూషణం తదితరులు ఉన్నారు.

యువకుడి దారుణహత్య

వినాయక్‌నగర్, జనవరి 20 : నిజామాబాద్ మండలపరిధిలోని రూరల్ ఏరియాలో ఓ యువకుడిని బండరాయితో కొట్టి దారుణంగా హత్య చేసి, మృతదేహాన్ని వాగులో పడేసిన ఘటన సోమవారం వెలుగుచూసింది. సమాచారం అందుకున్న నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సౌత్ రూరల్ సీఐ సురేశ్‌కుమార్, ఎస్సై మహ్మద్ ఆరిఫ్ ఘటనాస్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. సుమారు 35 నుంచి 40 ఏండ్ల వయస్సు ఉన్న యువకుడి తలపై బండరాయితో కొట్టి, హత్య చేసినట్లు గుర్తించారు. ఈ ఘటన ఒక రోజు ముందు జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహం లభించిన కెనాల్ నుంచి సుమారు 10 మీటర్ల దూరంలో రక్తం మరకలు ఉండడంతో అక్కడే హత్య చేసి, మృతదేహాన్ని కెనాల్‌లో పడేసినట్లు అనవాళ్లు గుర్తించారు. పోలీసులు డాగ్‌స్క్వాడ్‌తో పాటు క్లూస్ టీమ్‌ను రప్పించారు. జాగిలాలు మృతదేహం పడి ఉన్న కెనాల్ ప్రాంతం నుంచి గూపన్‌పల్లి గ్రామశివారులో ఉన్న బ్రిడ్జి వరకు వెళ్లి అక్కడే నిలిచిపోయాయి. అయితే అక్కడి వరకు నడిచి వెళ్లిన దుండగులు, బ్రిడ్జిపై నుంచి వేరే వాహనాల్లో వెళ్లి ఉంటారని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతుడు ఆటోనగర్‌కు చెందిన వ్యక్తిగా సమాచారం. మృతదేహానికి పంచనామా నిర్వహించి, ప్రభుత్వ దవాఖాన మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు నిర్వహిస్తున్నట్లుగా ఎస్సై మహ్మద్ ఆరిఫ్ తెలిపారు.

ఆటపాటలతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల
- క్యారమ్ పోటీలు ప్రారంభం

క్యారం పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల

వినాయక్‌నగర్, జనవరి 20 : ఆటపాటలతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత కలుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యారమ్ పోటీలను ఆమె సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు వసంత్‌రావు, సురేశ్, పిల్లి శ్రీకాంత్, దీపక్, తులసీదాస్, మాణిక్‌రాజు, ఆశ నారాయణ, సుజీత్, విఘ్నేశ్, అమిదాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో అవార్డులు

ఉత్తమ సేవలందించిన వారిని సన్మానిస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ప్రతినిధులు

ఖలీల్‌వాడి, జనవరి 20 : ఉత్తమ సేవలందించిన వారికి రోటరీ క్లబ్ ఆఫ్ జెమ్స్ ఆధ్వర్యంలో ఒకేషనల్ ఎక్స్‌లెన్సీ అవార్డులను ప్రదానం చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం రాత్రి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పాలిటెక్నిక్ మైదానంలో పచ్చదనం పరిశుభ్రత కోసం కృషిచేస్తున్న రిటైర్డ్ మిలిట రీమెన్ అశోక్, ఆవులు, పక్షులకు ఆహారం, నీటిని అందజేస్తున్న సిరిగాద ప్రసాద్, అంధుల కోసం ప్రత్యేకంగా కళ్లద్దాలు తయారుచేసిన ఆదిలాబాద్‌కు చెందిన రవి కిరణ్‌కు రోటరీ క్లబ్ గవర్నర్ గట్టు జ్ఞానప్రకాశ్ అవార్డులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అశోక్, పద్మ శ్రీనివాస్, గౌరీశంకర్ పాల్గొన్నారు.

పశువుల పాక దగ్ధం

చందూర్, జనవరి 20 : మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో పశువుల పాక దగ్ధమైంది. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న యజమాని.. పశువులను కాపాడే ప్రయత్నంలో ఒక ఆవుకు గాయాలయ్యాయి. పశువుల పాక పూర్తిగా దగ్ధమైందని, సుమారు రూ.50 వేల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు.

కొనసాగుతున్న ఎల్ఎల్‌బీ పరీక్షలు

డిచ్‌పల్లి, జనవరి 20 : టీయూలోని న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీ 5వ సెమిస్టర్ రెగ్యులర్ థియరీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం నిర్వహించిన పరీక్షకు 28 మంది విద్యార్థులకు 26 మంది హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు.

మాటలు రాని బాలుడిని చేరదీసిన పోలీసులు

వినాయక్‌నగర్, జనవరి 20 : జిల్లాకేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో రోడ్డుపై ఒంటరిగా తిరుగుతున్న ఓ బాలుడిని చేరదీశామని ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. సోమవారం సాయంత్రం సుమారు 9 ఏండ్ల వయస్సు ఉన్న ముస్లిం బాలుడు తప్పిపోయి, ఒంటరిగా తిరుగుతుండడాన్ని గుర్తించి, తమ సిబ్బంది చేరదీశారని పేర్కొన్నారు. బాలుడికి మాటలు రాకపోవడంతో వివరాలు చెప్పడం లేదని తెలిపారు. బాలుడు తమ ఆధీనంలో ఉన్నాడని, సంబంధీకులు 87126 59714 నంబర్‌కు ఫోన్ చేయాలని ఎస్‌హెచ్‌వో సూచించారు.

'విజయ్' విద్యార్థులకు స్వర్ణనంది అవార్డులు

ఖలీల్‌వాడి, జనవరి 20 : మహతి ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో మధుర నాట్య కాంతి – మధుర సంక్రాంతి పేరుతో హైదరాబాద్‌లోని శ్రీ త్యాగరాయ గాన సభ వేదికలో బాలికల నృత్యోత్సవాన్ని ఈనెల 12న నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకు చెందిన బాలికలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో విజయ్ హైస్కూల్‌కు చెందిన ఆరోతగరతి విద్యార్థిని జి.తన్వి, 2వ తరగతి విద్యార్థిని టి.భవన్య పాల్గొని, స్వర్ణనంది అవార్డును అందుకున్నారు. సదరు విద్యార్థులను స్కూల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ అమృతలత, అకడమిక్ డైరెక్టర్ వసంత, డైరెక్టర్ సుజాత సోమవారం అభినందించారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

జక్రాన్‌పల్లి, జనవరి 20 : జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురికి కల్యాణ లక్ష్మితకాగా.. జిల్లాకేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి లబ్ధిదారులకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ ఎంపీటీసీ గంగారెడ్డి, సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి

వినాయక్‌నగర్, జనవరి 20 : నిజామాబాద్ నగర శివారులోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో ఉన్న గలజాలి తలాబ్‌లో ఆదివారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టగా.. మృతుడి కుటుంబీకుల ఆచూకీ తెలిసిందని ఎస్సై పేర్కొన్నారు. మృతుడు బాబాన్‌సాబ్ పహాడ్ ప్రాంతంలోని నిజాంకాలనీకి చెందిన ముఖీత్ (22)గా గుర్తించినట్లు వెల్లడించారు. మృతుడు ఆదివారం తన బట్టలు ఉతుక్కోవడానికి చెరువు వద్దకు వెళ్లి, ప్రమాదవశాత్తు అందులోపడి మృతిచెందినట్లు కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రామసభలు సక్రమంగా నిర్వహించాలి

ధర్పల్లి/ ఇందల్వాయి/ రుద్రూర్, జనవరి 20 : నేటి (మంగళవారం) నుంచి నిర్వహించే గ్రామసభలను సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీవో బాలకృష్ణ జీపీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. తహసీల్దార్ మాలతి, ఎంపీవో రాజేశ్ పాల్గొన్నారు. ఇందల్వాయిలో కార్యదర్శులు, ఆపరేటర్లతో ఎంపీడీవో అనంతరావు, తహసీల్దార్ వెంకట్‌రావు సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులకు పథకాలతోపాటు కొత్త రేషన్‌కార్డులు అందేలా చూడాలని సూచించారు. ఎంపీవో రాజ్‌కాంత్‌రావు పాల్గొన్నారు. రుద్రూర్‌లో ఎంపీడీవో సురేశ్‌బాబు సమావేశం నిర్వహించి, కార్యదర్శులకు సూచనలు చేశారు. తహసీల్దార్ తారాబాయి, ఎంపీవో గంగాధర్ పాల్గొన్నారు.

టీజీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, జనవరి 20 : 2025-26 విద్యా సంవత్సరానికి సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, మహాత్మా జోత్యిరావు పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధారణ గురుకుల పాఠశాలల టీజీ సెట్ -2025కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జోనల్ ఆఫీసర్ ఫ్లోరెన్స్ రాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 4, 5,8 తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణాల్లో రూ.2 లక్షలు, గ్రామాల్లో రూ. 1.50 లక్షలు ఉండాలని స్పష్టం చేశారు. అర్హులైన విద్యార్థులు కుల, ఆదాయ, బర్త్ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో ఫిబ్రవరి ఒకటో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఫిబ్రవరి 23న ప్రవేశపరీక్ష పరీక్ష ఉంటుందని తెలిపారు.

హరిచరణ్ జూనియర్ కళాశాల తనిఖీ

ఖలీల్‌వాడి, జనవరి 20 : జిల్లాకేంద్రంలోని హరిచరణ్ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సోమవారం తనిఖీ చేశారు. కళాశాలలో విద్యాబోధనతో పాటు పరిసరాలను పరిశీలించారు. అధ్యాపకుల విద్యాబోధనపై విద్యార్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. ప్రాక్టికల్, వార్షిక పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, ప్రజాప్రతినిధులు,అధికారులు

ఖలీల్‌వాడి, జనవరి 20 : సెప్టెంబర్ 5న కుండపోత వర్షాల కారణంగా వాయిదా పడిన గురుపూజోత్సవ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఈవో అశోక్ అధ్యక్షత వహించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ముగ్గురు రాష్ట్రస్థాయి, 11 మంది జిల్లాస్థాయి అవార్డుపొందిన ఉపాధ్యాయులను ముఖ్యఅతిథిగా హాజరైన రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, విశిష్ట అతిథులు కూర రఘోత్తంరెడ్డి, నుడా చైర్మన్ కేశ వేణు, మేయర్ నీతూకిరణ్, గడుగు గంగాధర్, మునిపల్లి సాయారెడ్డి తదితరులు సన్మానించారు.

తాగుడు వద్దన్నందుకు.. బ్లేడుతో దాడి

- భార్య, అత్తకు తీవ్ర గాయాలు
- నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

రెంజల్, జనవరి 20 : తాగుడు మానుకోవాలని చెప్పినందుకు ఓ ప్రబుద్ధుడు భార్యతో పాటు అడ్డు వచ్చిన అత్త గొంతును కూడా కోసిన ఘటన మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రలోని భోకర్ ప్రాంతానికి చెందిన ఫారుఖ్‌కు కందకుర్తి గ్రామానికి చెందిన ఫర్జానాతో 12 ఏండ్ల క్రితం వివాహమైంది. మూడేండ్లుగా మద్యానికి బానిసై ఫారుఖ్ తరచూ భార్యతో గొడవ పడుతుండడంతో ఆమె పిల్లలను తీసుకొని పుట్టింటికి వచ్చింది. భార్యతో కాపురం చేసేందుకు ఫారుఖ్ మూడు నెలల క్రితం అత్తగారింటికి వచ్చి అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాడు. కూలీపనులు చేసి వచ్చిన డబ్బులతో మద్యం తాగితే ఇల్లు గడవడం ఎలా అని ప్రశ్నించడంతో భార్య ఫర్జానాపై ఫారుఖ్ బ్లేడ్‌తో ఎడమ భాగంలో గొంతుకోశాడు. అరుపులు విన్న ఫర్జానా తల్లి ఖమార్‌బీ అక్కడికి రాగా ఆమె గొంతును కూడా కోశాడు. విషయం తెలుసుకున్న స్థానికులు ఫారుఖ్‌ను అక్కడే బంధించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలైన ఫార్జానా, ఖమార్‌బీను బోధన్ ప్రభుత్వ దవాఖానకు, మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ దవాఖానాకు తరలించారు. నిందితుడు ఫారుఖ్‌ను సోమవారం తెల్లవారు జామున అదుపులో తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. భార్య ఫర్జానా ఫిర్యాదు మేరకు ఫారుఖ్‌పై కేసు నమోదు చేసి, కోర్టుకు రిమాండ్ తరలించినట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

'విజయవంతం చేయాలి'

శక్కర్‌నగర్/ నవీపేట/ఆర్మూర్‌టౌన్, జనవరి 20: ఈనెల 25 వ తేదీ నుంచి 28 వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని సదరు పార్టీ బోధన్ ఏరియా కార్యదర్శి జంబిశెట్టి శంకర్ గౌడ్ కోరారు. రాష్ట్ర మహాసభల పోస్టర్లను సోమవారం బోధన్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కుమార స్వామి, ఏశాల గంగాధర్, దాసి రవి, నాగరాజు, రాజు, హన్మాండ్లు, రెడ్డి ఉన్నారు. సీపీఎం రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నవీపేట మండల కార్యదర్శి నాయక్‌వాడి శ్రీనివాస్ కోరారు. నవీపేటలోని సుందరయ్య కాలనీలో మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆర్మూర్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకట్ విలేకరులతో మాట్లాడారు. సభకు మేధావులు, విద్యార్థులు, కార్మికులు తరలి రావాలని కోరారు.

విద్యార్థులకు అభినందన

మోర్తాడ్, జనవరి 20: రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబై వారు నిర్వహించిన కలరింగ్ కాంపిటేషన్‌లో ప్రతిభ చూపిన బహుమతులు సాధించిన మోర్తాడ్‌లోని బాలికల ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. వారికి వచ్చిన పతకాలు, సర్టిఫికెట్లను అందజేశారు.

డైరీ ఆవిష్కరణ

మోర్తాడ్, జనవరి 20: మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రం వద్ద సోమవారం తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రూపిందించిన డైరీని ఎంఈవో సమ్మిరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Bheemgal Branch, Dist. Nizamabad agreed to accord Loan to Borrower: **Thumburi Aravind Kumar** S/o Thumburi Sagar Swamy, Age 34 Yrs, Occ: Business, R/o H.No.17-15, SC BC Colony, Morthad (V&M), Nizamabad (Dist) on mortgage of the schedule referred plot property. The above prospective loanee agreed to create first charge against schedule property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections raised afterwards shall be deemed to be 'Waived' and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property. Hence this notice

SCHEDULE PROPERTY

The Open Place in Survey No.634, admeasuring total Plot area (58'-8" X 130'-0") = 7626.58 Square Feets or 847.39 Square Yards or 708.50 Square Meters and situatd at Pachal Nadkuda Village of Vailpoor mandal, Nizamabad district, within the limits of Regn.Sub dist Bheemgal, Regn.Dist Nizamabad, Grama Sachivalayam Pachal Nadkuda, MPP Vailpoor, ZPP Nizamabad

Bounded as below: North: Land of Baddi Vishwanath, **South:** G.P.Road **East :** Land of Morthad Ramesh **West :** Land of Anganti Erranna

Sd/- R.JAGADISHWER RAO, Advocate Subhashnagar, Nizamabad, Cell:9848094409

దుండగులను శిక్షించాలి

మోర్తాడ్, జనవరి 20: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీ ఉన్నతపాఠశాల హెచ్ఎం రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని మోర్తాడ్‌లోని బాలికల ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయునిపై దాడికి నిరసనగా భోజన సమయంలో మధ్యాహ్నం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలరాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ పురస్కార గ్రహీతకు సన్మానం

నవీపేట, జనవరి20: చిందు కళా యక్షగాన రంగంలో రాణించి చిందు యక్షగాన కళా రత్న జాతీయ పురస్కారాన్ని అందుకున్న పులింటి గోదావరిని స్థానిక బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో సన్మానించారు. నాయకులు మాట్లాడుతూ చిందు కళలు అంతరిస్తున్న తరుణంలో నవీపేటకు చెందిన గోదావరి తన కళా నైపుణ్యంతో చిందు యక్షగాన ప్రదర్శనలు చేసి అవార్డుకు పొందడం గర్వించదగ్గ విషయమని అన్నారు.

సర్వే పరిశీలన

మాక్లూర్, జనవరి 20: మండలంలోని మానిక్‌బండార్, గంగరమంద గ్రామాల్లో కొనసాగిన రైతు భరోసా సర్వేను ట్రైనీ కలెక్టర్ సంకేత్‌కుమార్ సోమవారం పరిశీలించారు. సాగుకు యోగ్యం కాని భూములను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం లబ్ధిదారుల గుర్తింపు సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ శేఖర్, 2వ డివిజన్ కార్పొరేటర్ రాయ్‌సింగ్, గిర్దావర్ షఫీ తదితరులు ఉన్నారు.

వ్యాసెక్టమీ శిబిరాన్ని విజయవంతం చేయాలి

చౌట్‌పల్లిలో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మోర్తాడ్, జనవరి 20: ఈనెల 23న మోర్తాడ్ సీహెచ్‌సీలో నిర్వహించనున్న వ్యాసెక్టమీ (పురుషులకు కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స) శిబిరం విజయవంతమయ్యేలా చూడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అన్నారు. సోమవారం కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి దవాఖానను తనిఖీ చేశారు. అనంతరం మోర్తాడ్ సీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన సమావేశంలో సిబ్బందితో మాట్లాడారు. మగవారికి ఎటువంటి కోతలూ, కుట్టు లేకుండా సులువుగా వ్యాసెక్టమీ ఆపరేషన్ చేస్తారని అన్నారు. గ్రామాల్లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునే కుటుంబాలను గుర్తించి మగవారికి అవగాహన కల్పించి వారిని తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి స్పందన, హెచ్‌వో సత్యనారాయణ, ఆర్మూర్ మలేరియా నియంత్రణ అధికారి సాయి పాల్గొన్నారు.

27 ఎజెండా అంశాలకు ఆమోదం

బోధన్, జనవరి 20: బోధన్ మున్సిపాలిటీ పాలకవర్గం సర్వసభ్య సమావేశంలో 27 ఎజెండా అంశాలు ఏకగ్రీవ ఆమోదం పొందాయి. మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి అధ్యక్షత సోమవారం సమావేశం వహించారు. సమావేశంలో ఆమోదం పొందిన 27 అంశాల్లో ప్రధాన ఎజెండాకు చెందిన అంశాలు 20 ఉండగా, అదనపు ఎజెండా అంశాల ఏడు ఉన్నాయి. ఈ నెల 26న బోధన్ మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం గడువు ముగియనుంది. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ముప్కాల్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 1987-88 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలు చల్లుకుంటూ వేదికపైకి ఆహ్వానించి సన్మానించారు. - ముప్కాల్, జనవరి 20

వీడీసీ స్థలాన్ని అక్రమంగా పట్టా చేసుకున్నారు..

తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించిన సోన్‌పేట్ గ్రామస్తులు

తహసీల్ కార్యాలయం ఎదుటు ధర్నా చేస్తున్న గ్రామస్తులు

మెండోరా, జనవరి 20: మండలంలోని సోన్‌పేట్ గ్రామాభివృద్ధి కమిటీకి చెందిన సర్వే నంబర్ 329లో ఉన్న ఒక ఎకరం భూమిని అదే గ్రామానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని ఆరోపిస్తూ గ్రామస్తులు సోమవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయాన్ని ముట్టడించారు. వీడీసీకి చెందిన భూమిని ఎవరికీ తెలియకుండా ఆయన తన పేరుపై పట్టా చేయించుకున్నాడని ఆరోపించారు. వ్యక్తి పేరున ఉన్న భూమిని తిరిగి వీడీసీకి పట్టా చేసి ఇవ్వాలని పట్టుబట్టారు. తహసీల్దార్ ఎంత చెప్పినా వినకపోవడంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమింపజేశారు.

పాఠశాలకు టీవీ వితరణ

టీవీని అందజేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దేవేందర్

మోర్తాడ్, జనవరి 20: రేగుంట రాజన్న జ్ఞాపకార్థం ఆయన కుమారుడు బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి మండల అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ రేగుంట దేవేందర్ ఉప్లూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అండ్రాయిడ్ టీవీని అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ తరగతుల బోధనకు ఆండ్రాయిడ్